

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం భైరవ కొండ...
● స్వయంభుగా వెలిసిన కాలభైరవుడు
● ప్రతీ ఆదివారం భక్తుల రద్దీ
7

సమగ్ర కులగణనకు సమాయత్తం
● 60రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు
● ఎన్యూమరేటర్ల నియామకానికి కసరత్తు
● 75ప్రశ్నలతో సర్వే పత్రం ● 6నుంచి సర్వే షురూ
7

ట్రెండ్ మారింది గురూ..
● బెల్లం టీకి పెరిగిన డిమాండు
● వెలుస్తున్న దుకాణాలు
6

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నాల్గవతరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్క రించాలని ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు సంఘం జిల్లా అధ్య క్షుడు గీట్ల సుమిత్ వినతి పత్రం అందించారు. మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో యూనియన్ స్థలం గురించి ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించి ఎమ్మెల్యే సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. నాయకులు గోవర్దన్, శ్రీని వాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పటేల్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

నస్పూర్, (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ మున్సిపాలిటీ 11వ వార్డు పటేల్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పర్యటించారు. స్థానికులు కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకె ళ్ళారు. కాలనీవాసులు చెప్పిన సమస్యల ను పరిష్కరిస్తా నని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



ఎంపీని సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి మందమర్రిలోని అస్రా మసీదులో జెండా పండగకు ఆయనహాజరై మాట్లాడారు. ముస్లీంల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా అస్రా మసీదు పెద్దలు ఎంపీని ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు.

అండాలమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలు



- ఇష్టారీతిన భూముల విక్రయాలు
- ఒక్కో ప్లాట్‌కు రూ. లక్ష చొప్పున నాయకుల వసూలు
- జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతం

మంచిర్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూముల కబ్జా పరిపాటిగా మారింది. స్థలంలో మొదట తాత్కాలిక గుడిసెలు వేసి అదును చూసి పక్కా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పట్టణంలోని అండాళమ్మ కాలనీలో ప్రస్తుతం ఇదే తంతు కొనసాగుతోంది. అండాళమ్మ కాలనీ జిల్లా కేంద్రానికి శివారులో ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న చోటా, మోటా నాయకులు గుట్టుచప్పుడు కాకుండా స్థలాలను చేజిక్కించుకుంటున్నారు. ఒక్కొక్కరు ఐదారు చోట్ల స్థలాలను ఆధీనంలో ఉంచుకోవడం గమనార్హం.



కాలనీలో మేకల పెంపకం పేరిట వెలిసిన తాత్కాలిక గుడిసె

పేదలకు నివాస స్థలాల కోసం...

మాజీ ఎమ్మెల్యే, దివంగత గోనె హన్మంతరావు సొంత స్థలాన్ని పేద ప్రజల నివాస స్థలాల కోసం 40 సంవత్సరాల క్రితం రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు. అప్పటి నుంచి ఆ స్థలం ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లింది. ఇంటి స్థలాలు లేని, పేద ప్రజలకు అధికారులు పట్టాలు అందజేశారు. వారంతా శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో హన్మంతరావు అతని తల్లి అండాళమ్మ పేరును కాలనీకి పెట్టారు. అనంతరం విద్యుత్ సౌకర్యం, తాగునీరు, సీసీ రోడ్లు వేయడంతో కాలనీ రూపురేఖలు మారాయి. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు కింద కాలనీ ఉండగా, ప్రస్తుతం అక్కడ శాశ్వత నిర్మాణాలతోపాటు బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి.

విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలు...

అండాళమ్మ కాలనీ అభివృద్ధి చెందడంతో కబ్జాదారుల కళ్లు అక్కడి భూములపై పడ్డాయి. కాలనీలో ఉన్నవి ప్రభుత్వ స్థలాలే కావడంతో కబ్జాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కాలనీలో దర్శనమిస్తున్న నిర్మాణాల్లో చాలా వాటికి ఎలాంటి పట్టాలు, ఇంటి నిర్మాణ అనుమతులు లేవు. అయినా ప్రతీ ఇంట్లో విద్యుత్ సౌకర్యం, మున్సిపల్ నల్లాలు ఉన్నాయి. అధికారుల అండతో అక్రమంగా ఇంటి నెంబర్లు, మీటరు, నల్లా కనెక్షన్లు పొందినట్లు తెలుస్తోంది.

మిగతా 7లో..

అభివృద్ధి చూసి ఓర్వలేకనే దిగజారుడు రాజకీయాలు

మంచిర్యాల అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐబీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రికి పదవి వియోగం ఉందంటూ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తూ, ఆయన జ్యోతీషం చెప్పడం మానుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరణ పొందుతుందన్నారు. నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండు ఒకటయ్యానని, అంతా కలిసికట్టుగా వచ్చినా తనను ఢీకొట్టలేరని, అభివృద్ధితోనే వారికి సరైన సమాధానం చెప్తానన్నారు. ఒక్కటవ్వలేదని నిరూపించేందుకు కాణిపాకం వినాయకుడి ఆలయంలో ప్రమాణం చేద్దామా అంటూ సవాల్ విసిరారు.

ఐబీలో రూ.300 కోట్లతో 650 పడకల సామర్థ్యం కల్గిన సూపర్ స్పెషా లిటీ ఆసుపత్రిని త్వరలోనే పూర్తి చేస్తామని, ఎంసీహెచ్‌ను ఆసుపత్రిలోకి షిఫ్టు చేస్తామన్నారు. అలాగే ముంపును నివారించేందుకు రూ.255.59 కోట్లతో కరకట్టను త్వరలోనే నిర్మిస్తామని, ఇందుకోసం సర్వే కూడా పూర్త యిందని, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నివాసాల వారు ఎవరైనా పేద, మధ్యతరగతి వాళ్లు ఉంటే వారికి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. రహదారుల నిర్మాణాలకు రూ.70 కోట్లను మంజూరు చేయించానన్నారు. రైతు భరోసాపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, కొన్ని సవరణల కారణంగా జాప్యం అవుతుందని, అందరికి పంట పెట్టుబడి సహాయం అందుతుందన్నారు. నియోజకవర్గంలో ప్లాట్లుగా విక్రయించిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తా



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రేంసాగర్‌రావు, శివసేనారెడ్డి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయికుంటలో 14 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఎకరాల్లో రెండు ఎకరాలు నర్సింగ్ కళాశాల కోసం, మిగితా 12 ఎకరాలు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కేటాయిస్తామన్నారు. ఇందులో ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులను తీసుకువచ్చి క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం శివసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, యువత చెడు మార్గం పట్టకుండా క్రీడల్లో రాణించాలన్నారు. మంచిర్యాలను స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాన్ని తీసుకోవాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సంజయ్ కుమార్

శ్రీరాంపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు టీడీపీ సభ్యత్వాన్ని తీసుకోవాలని పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో సభ్యత్వ నమోదును కొనసాగిస్తున్నామన్నారు. రూ.100తో సభ్యత్వం పొందితే రెండేళ్ల పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని పేర్కొన్నారు. కార్యకర్తలకు చిన్న పిల్లలు ఉంటే వారి విద్యాభ్యాసం పార్టీ చూసుకుంటుందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు పార్టీ కార్యకర్తల కోసం అమలు చేస్తున్నట్లు చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, ఆడ పిల్లల వివాహానికి ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారు. ప్రజలంతా పార్టీ సభ్యత్వం పొంది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దపల్లి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు, నాయకులు గరిగంటి రాజయ్య, ఆవుల సుధాకర్, సామ రఘుపతి, కె. రాజు, మిడిదొడ్డి మొండయ్య, వడ్లకొండ వెంకన్న, బొజ్జ రవి, సంకూరి భూమయ్య పాల్గొన్నారు.

సీతారాంపల్లిలో రైతులకు అవగాహన



సీతారాంపల్లిలో పొలంబాటలో విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌తో పాటు రైతులు

నస్పూర్, నవ ంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీతారాంపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం ద్వారా విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నస్పూర్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పొలాల వద్ద వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ వినియోగించాలన్నారు. నాణ్యత కలిగిన విద్యుత్ మోటార్లను, స్టార్టర్లను వినియోగించాలన్నారు. పంట పొలాల్లోని లైన్ల మధ్య విద్యుత్ సమస్య వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు తీయడం, వేయడం చేయకూడదని, సమాచారం ఇస్తే సిబ్బంది వస్తారన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది తేజవత్ పాపాలాల్, లక్ష్మన్, వెంకటస్వామి, పలువురు రైతులు పాల్గొన్నారు.

శిలాఫలకానికి ఇరవై ఏండ్లు..

● 2003లో తహసీల్దార్ కార్యాలయానికి శంకుస్థాపన ● ఇప్పటికీ పూర్తికాని భవనం ● స్త్రీశక్తి భవనంలో కొనసాగింపు

నెన్నెల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెన్నెల తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఇరవై ఏళ్లు దాటింది. భూమిపూజలో పాల్గొన్న అప్పటి రాష్ట్ర మంత్రులు ఏడాదిలో పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. స్వరాష్ట్రం వచ్చింది.. ప్రభుత్వాలు మారాయి.. ఇప్పటికి ముగ్గురు ఎమ్మెల్యేలు మారారు.. కాని భవన నిర్మాణానికి మాత్రం మోక్షం కలగడం లేదు. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా అప్పటి శిలాఫలకం నిలుస్తోంది. నాటి నుంచి నేటి వరకు ప్రజలు, కార్యాలయ సిబ్బంది ఇక్కట్లు పడుతూనే ఉన్నారు.

ఇరుకు గదులతో ఇబ్బందులు

నెన్నెల తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యవస్థ ఏర్పాటయ్యాక ఆఫీసును ఓ ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయాన్ని అప్పట్లో మావోయిస్టులు పేల్చివేశారు. అనంతరం అటవీశాఖ గెస్ట్‌హౌజ్‌కు మార్చగా ఆ భవనాన్ని సైతం మావోయిస్టులు దహనం చేశారు. అదే భవనానికి మరమ్మతు చేసి కార్యాలయాన్ని కొనసాగించారు. అటవీశాఖ అధికారులు ఖాళీ చేయడంతో ఆరేళ్ల కిందట స్త్రీశక్తి భవనంలోకి మార్చారు. ఈ భవనంలో మూడు గదులు మాత్రమే ఉన్నాయి. ఒక గదిలో కంప్యూటర్ ల్యాబ్ ఉండగా, మరో గదిని తహసీల్దార్ ఉపయోగించుకుంటున్నారు. దీంతో మిగిలిన ఒక గదిలో స్టాఫ్ మొత్తం విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. రికార్డులు భద్రపర్చే గది లేక పోవడంతో ముఖ్యమైన ఫైళ్ళు ఎక్కడ పడితే అక్కడే పెట్టాల్సి వస్తోంది. ఫీల్డ్ వర్క్ చేసి వచ్చే సర్వేయర్లు, వీఆర్ఏలకు కనీసం కూర్చొవడానికి కుర్చీలు లేవు. దూర ప్రాంతాల నుంచి వివిధ పనులకు వచ్చిన రైతులు, విద్యార్థులు, మహిళలు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. తాము నిర్మించుకున్న భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారని, ఖాళీ చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తమకంటూ ఒక వేదిక లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు అంటున్నారు.



భవన నిర్మాణం కోసం 2003లో వేసిన శిలాఫలకం

● భూమి పూజ చేసినా..

తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి 2003 లో రూ.15 లక్షలు మంజూరయ్యాయి. అప్పటి ఉమ్మడి రాష్ట్ర మంత్రులు చంద్రమోహన్ రెడ్డి, పడాల భూమన్న, పెద్దపల్లి ఎంపీ సుగుణ కుమారి, జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, కలెక్టర్ వికాస్ రాజ్‌లు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారులు, నాయకులు ఎవరు పట్టించుకోక పోవడంతో శిలాఫలకం వేసి 21ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ఇంతవరకు ప్రారంభం కాలేదు. కొత్తగా నిధులు మంజూరు చేసి సొంత భవనం నిర్మించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.



స్త్రీశక్తి భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



గుర్తింపు సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

భీమారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక, రాజకీయ, విద్య, కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి కల్పన పేర్కొన్నారు. ఆదివారం బీసీ కాలనీలో జిల్లా పంచాయతీ అధికారి, ముదిరాజ్ కాలనీలో జరుగుతున్న సర్వేను మండల ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. సర్వేను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. స్టిక్కర్లను ప్రతీ ఇంటికి అతికించాలన్నారు. ఎంపీడీవో మధుసూదన్, మండల పంచాయతీ అధికారి సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): ఇంటి యాజమాని గుర్తింపు సర్వేను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్ అన్నారు. కొల్లూరులో ఇంటి యజమాని గుర్తింపు సర్వేను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌తో పాటు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి) : కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమా వేశం నిర్వహించారు. ప్రజల సామాజిక ఆర్థిక, ఆదాయ, రాజకీయ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రభుత్వం కులగణన నిర్వహిస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత ఊరేగింపు

మందమర్రిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలం లోని కాళీనగర్‌లో మూడు రోజుల పాటు పూజలందుకున్న కాళీమాతకు ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు మహిళలు కాళీమాత విగ్రహ నుదుటిపై సిందూరం దిద్దారు. చల్లగా వెళ్లిరా తల్లి అంటూ వీడ్కోలు పలికారు. అనంతరం మంచిర్యాల గోదావరిలో నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బోడ దర్మేందర్, రీనారాణిదాస్, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.



కాళీమాత ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

న్యూస్ బాక్స్

టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శాంతి కుమార్


శాంతికుమార్

కాగజ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీయూటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడుగా బత్తుల శాంతికుమార్, గౌరవ అధ్యక్షుడుగా గోడం జనార్దన్, ప్రధానకార్యదర్శులుగా పెండ్యాలసదాశివ్, సహ అధ్యక్షుడుగా రాథోడ్‌ప్రకాష్, బానుప్రకాష్, మహిళ సహఅధ్యక్షుడుగా వి సవిత, సంయుక్తకార్యదర్శిగా బానోత్‌ప్రకాష్, ఈశ్లవత్ ధనరాజ్, మహిళ కార్యదర్శిగా లావణ్య, శిల్ప, ఆర్థికకార్యదర్శిగా కె వెంకట్‌రావు, జిల్లాకార్యదర్శులుగా శ్యాంరావు, జిశ్రీనివాస్, జలపత్ రావు, పి లక్ష్మణ్, ప్రవీణ్, సీహెచ్ రవి, నాగేశ్వర్ రావు, ఎండీ అనీష్ అహ్మద్, ఎ రవికుమార్, ఎస్ మధుకర్, గణేష్, ఆడిట్‌కమిటీ సభ్యులు బి శ్యాంసుందర్, శాంతి స్వరూప్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బన్న రవీందర్, పత్తిసత్తయ్య వ్యవహరించారు. ఈసందర్భంగా నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు శాంతికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు పోరాటాలు చేస్తామన్నారు.

ఐకేపీ వీవోఏల జిల్లా కార్యవర్గం

ఆసిఫాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఐకేపీ వీవోఏల జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా బుద్ధు, ప్రధానకార్యదర్శిగా రోజ, కోశాధికారిగా ధన్‌రాజ్‌ను ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ఐకేపీవీవోఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల సమాఖ్య కార్యాలయం ఎదుట దర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి వీవోఏలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ట్రెండ్ మారింది గురూ..



బెల్లం టీతో ఉపయోగాలు..

బెల్లం టీ తాగితే జీర్ణశక్తి మెరుగవుతుందని, గ్యాస్, అజీర్ణ సమస్యలు తగ్గిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే బెల్లంలో యాంటీ ఆక్సీడెంట్లు ఉండటం వలన శరీరంలో ఉన్న విషపదార్థాలను బయటకు పంపే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొంటున్నారు. అలాగే బెల్లం రక్తప్రసరణను మెరుగుపర్చటం ద్వారా రక్తంశుద్ధి చేస్తోందని, హార్మోన్ల సమతుల్యత కూడా ఉంటుందని పేర్కొంటున్నారు.

- బెల్లం టీకి పెరిగిన డిమాండు
- వెలుస్తున్న దుకాణాలు

కాగజ్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజల అభిరుచులకు మేరకు కొత్త కొత్త ఆహారపదార్థాలు లభిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు టిఫిన్ సెంటర్‌లు, బిర్యానీ సెంటర్లు వెలియగా, కొద్ది రోజుల క్రితం వరకు టీ హబ్‌లు వెలిశాయి. ఇప్పుడు మరింత కొత్తగా బెల్లంతో తయారు చేసిన టీ తయారు చేసే దుకాణాలు వెలుస్తు న్నాయి. కాగజ్‌నగర్‌లో ఇప్పటికే ఆరు బెల్లం టీ దుకాణాలు వెలిశాయంటే వీటి పట్ల ప్రజల ఆదరణ ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

షుగర్ వ్యాధిగ్రస్తులు బయటికి వెళ్లినప్పుడు అందరిలా టీ తాగలేరు. ఎందుకంటే వారికి షుగర్ కాబట్టి. అటువంటి సందర్భాల్లో వారు షుగర్ లేని చప్పటి చాయ్ తాగుతారు. కానీ ఇప్పుడు వారు కూడా అందరిలా టీ తాగవచ్చు. కాకపోతే ఈ టీలో చక్కెరకు బదులు బెల్లం ఉపయోగిస్తారు. బెల్లం ఉపయోగించినప్పటికీ రుచిలో ఏ మాత్రం తక్కువ కాదు. పసందైన రుచులతో బెల్లం టీ లభిస్తుండడంతో షుగర్ ఉన్న వారే కాదు.. షుగర్ రాకూడదు అనుకునే వారు కూడా బెల్లం టీ పై మక్కువ చూపిస్తున్నారు. ఫలితంగా ప్రజల డిమాండ్ మేరకు జిల్లాలో తక్కువ కాలంలోనే ఆరుకుపైగా బెల్లం టీ దుకా ణాలు వెలిశాయి. ప్రజలు కూడా ఎప్పుడు ఒకే మాదిరి కాకుండా కాస్త వినూతనంగా ఉండాలనే భావన తోనూ బెల్లం టీ తాగడానికి ఇష్టపడుతున్నారు. ఉదయం, సాయంత్రం రద్దీ ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.


కాగజ్‌నగర్‌లో బెల్లం టీ తయారు చేస్తున్న యూనుస్

మంచి ఆదరణ లభిస్తోంది..

బెల్లం టీకి డిమాండ్ బాగానే ఉంది. రోజుకు కనీసం 200నుంచి 300ల కప్పుల వరకు టీ విక్ర యిస్తున్నాను. హైదరాబాద్ నుంచి బెల్లం తీసుకొస్తున్నాం. ధర రూ.10 చొప్పున అమ్ముతున్నాం. కష్టమర్ల నుంచి మంచి ఆదరణ వస్తోంది.

- యూనుస్, బెల్లం టీ నిర్వాహకుడు, కాగజ్‌నగర్



హోరాహోరీగా కొనసాగుతున్న
రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు


పోటీల్లో తలపడుతున్న జట్లు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని గిరిజనబాలికల ఆదర్శ పాఠశాల ఆవరణలో గడిగొప్పుల సదానందం(పీడీ) జ్ఞాపకార్థం జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు రెండోరోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. మధ్యాహ్నం వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగగా ఈ మ్యాచ్‌లలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మధ్యాహ్నం జరిగిన సెమీఫైనల్ పోటీల్లో కరీంనగర్‌పై ఆదిలాబాద్ జట్టు విజయం సాధించగా, రంగారెడ్డి జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందింది. గెలుపొందిన క్రీడాజట్లకు సోమవారం ఫైనల్‌పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో క్రీడాధికారి మీనారెడ్డి, పీడీలు, పీఈటీలు అరవింద్, సాగర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై దుకాణాలు.. రాకపోకలకు అవస్థలు


రోడ్డుపై దుకాణాలను ఏర్పాటు చేసిన చిరువ్యాపారులు

బెజ్జూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై దుకాణాలను ఏర్పాటు చేస్తుండడంతో రాకపోకలకు తీవ్రఇబ్బందులు కలుగుతున్నాయి. మండలకేంద్రంలో ప్రతి ఆదివారం వార సంత నిర్వహిస్తుండడంతో సంతలో సామగ్రి కొనుగోలు, అమ్మకాలకోసం వివిధ గ్రామాలనుంచి ప్రజలువస్తుంటారు. దీంతో ప్రధానరోడ్డుపై, ఇరువైపులా సంతకు వచ్చే విక్రయాదారులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేక్రమంలో ద్విచక్ర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్‌చేస్తుండడంతో బస్సులు,ఇతర వాహనాలకు రాకపోకలకు తీవ్రఅంతరాయం కలుగుతోంది. సంతకావడంతో రద్దీపెరిగి ట్రాఫిక్‌జాం అవుతోంది. రోడ్డుపై దుకాణాలు ఏర్పా టుచేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ అధికారులకు స్థానికులుఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై దుకాణాలు, వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


భరత్ (ఫైల్)

మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంగడి బజార్‌కు చెందిన కోయల్కర్ భరత్ (28) అనే యువకుడు శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదివారం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భరత్ బీటెక్ పూర్తి చేసినా ఉద్యోగం రాకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. మృతుడి బాబాయి మధు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి

సిర్పూర్(టి), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి సమీపంలో ఆదివారం ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ శంకర్(58) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం రెబ్బెనకు చెందిన రాథోడ్ శంకర్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మండల సరిహద్దు హుడ్కిలి చెక్‌పోస్టు వద్ద విధులు ముగించుకుని స్వగ్రామమైన రెబ్బెనకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. వేంపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ప్రమాదంలో శంకర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బైక్‌పై ఉన్న మండల కేంద్రంలోని షేక్మాద్‌గూడకు చెందిన నిఖిల్, పారిగాం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. యువకులు మద్యం తాగి వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నామని ఎస్సై తెలిపారు. రాథోడ్ శంకర్ భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మ్యాట్రిమోనీ పేరుతో మోసం
- దంపతుల అరెస్ట్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను మ్యాట్రిమోనీ పేరుతో మోసం చేస్తున్న దంపతులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కేంద్రం అశోక్‌నగర్‌కు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన సౌజన్య భార్యాభర్తలు. వీరు కొంతకాలంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఈ దంపతులు తెలుగు మ్యాట్రిమోనీ డాట్ కామ్ అనే వెబ్‌సైట్‌లో వారి నంబర్‌తో అమ్మాయిల పేరు, ఫొటోలతో ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేసి అబ్బాయిలకు రిక్వెస్ట్ పెడుతున్నారు. స్పందించిన వారితో మాటలు కలిపి చాట్ చేస్తారు. తర్వాత అమ్మకు ఆరోగ్యం బాగాలేదని, ఆసుపత్రిలో ఉందని, డబ్బులు కట్టాలని మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తారు. మంచిర్యాలకు చెందిన ఓ యువకుడి వద్ద 17 లక్షల రూపాయలు వసూలు చేశారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ డీజీ షికాగోయల్‌కు ఫిర్యాదు చేశాడు. డీజీ, రామగుండం సీపీ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేశామని సైబర్ క్రైమ్ ఏసీపీ ఎం వెంకటరమణ తెలిపారు. ఆదివారం నిందితులను పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురం గ్రామంలో పట్టుకున్నామని, నిందితులను జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించామని ఆయన తెలిపారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి రిక్వెస్ట్‌కు స్పందించవద్దని ఏసీపీ సూచించారు.

సిక్కు సంఘం అధ్యక్షుడిగా రంజిత్‌సింగ్


రంజిత్ సింగ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

లక్సెట్టిపేటరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణానికి చెందిన సర్దార్ రంజిత్ సింగ్ పది జిల్లాల సిక్లిగర్ (సిక్కు) సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని గురునానక్ గార్డెన్‌లో 10 జిల్లాలు (ఆదిలాబాద్, కొమురంభీంఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట) సిక్కు కుల సంఘం సమావేశం నిర్వహించారు. పది జిల్లాల అధ్యక్షునిగా రంజిత్‌సింగ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిక్కుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎన్నికైన రంజిత్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో దరఖాస్తులు చేసుకోండి

బెల్లంపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ ప్రవేశానికి ఈ నెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, కో ఆర్డినేటర్ డాక్టర్ ఏకాంబరంలు ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 40 మంది విద్యార్థులు ఇప్పటికే అడ్మిషన్‌ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుని వెరిఫికేషన్ చేయించుకోకుండా, అడ్మిషన్ ఫీజు చెల్లించకుండా ఉన్నారని, వారంతా వెంటనే ఫీజులు చెల్లించి ప్రవేశం పొందాలని సూచించారు.

ఆలయ భూములను రక్షించాలని రాస్తారోకో

బెల్లంపల్లిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ భూములను రక్షించాలని బీజేపీ నాయకులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ గతంలో ఆలయ భూములను కబ్జా చేశారని కమిటీ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారని, అదికారులు సర్వేచేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపారన్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమి కబ్జా చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండానే ఎక్స్‌కావేటర్‌తో ఆలయ భూములను చదును చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపుతున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ముసుగులో ఉన్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులగం తిరుపతి, కేశవరెడ్డి, దూది ప్రకాష్, శ్రీనివాస్, దీపారాణి, అశోక్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు బెంచీలు పంపిణీ

మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్రీయ రహదారి వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సిమెంటు బెంచీలను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ సొత్కు సుదర్శన్ మాట్లాడుతూ మందమర్రిలోని రహదారి పక్కన రెండు బస్టాప్‌లు, ఆటో స్టాండ్ ఉండడంతో ప్రయాణికులు కూర్చునేందుకు 12 సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ట పూజలు

గర్మిళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గోదావరి క్షేత్రంలోని గౌతమేశ్వర ఆలయంలో ఆదివారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాదారణ, నవగ్రహ వాస్తు, మండపారాధనలు, జలాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ప్రారంభమైన మహోత్సవం సోమవారం వరకు జరుగుతుందని ప్రతిష్టాచార్యులు గడియారం బాలాజీశర్మ తెలిపారు.

పార్టీలో పనిచేసే వారికి సముచిత స్థానం

గర్మిళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో పనిచేసే ప్రతీ ఒక్కరికి పార్టీ నాయకత్వం సముచిత స్థానం కల్పిస్తుందని జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, టీటీడీ బోర్డుసభ్యుడు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలకు చెందిన జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ సైదుల శ్రీనివాస్ మహేందర్‌రెడ్డిని హైద్రాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ నూతన జీఎంగా ఎల్‌వి సూర్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధికారులసంఘం శ్రీరాంపూర్ ఏరియాఅధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీదర్, ప్రాజెక్ట్ అధికారి ఏవీరెడ్డి, ఏజెంట్లు రాముడు,శ్రీధర్, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, ఆనంద్‌కుమార్, చంద్రలింగం, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జీఎం..

శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మాజీజీఎం బి సంజీవరెడ్డి,రక్షణాధికారిజక్కారెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎం

సంజీవరెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే

శ్రీరాంపూర్ ఏరియా మాజీ జీఎం బి సంజీవరెడ్డిని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఆదివారం సన్మానించారు. సంజీవరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. బంగ్లాస్ ఏరియాలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన జీఎం సూర్యనారాయణ, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, అధికారులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల సహకారం మరువలేనిది



ఎస్‌వోటూ జీఎంను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, తోటి అధికారులు అందించిన సహకారం మరువలేనిదని భూపాలపల్లికి జీఎంగా వెళ్తున్న ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఏఐటీయూసీ నాయకులు జీఎం కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాలు పారిశ్రామిక సంబంధాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నారు. సంస్థ ప్రగతికి కార్మికులు, నాయకులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మందమర్రి జీఎం దేవేందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, నాయకులు గాండ్ల సంపత్, రాజేశ్వర్‌రావు, బానయ్య మేకల సంతు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపేరుతో మోసం: హెచ్ఎంఎస్ ఆరోపణ

శ్రీరాంపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గుడిపేరుతో ఏఐటీయూసీ ఘరానా మోసం చేసిందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. కార్మికులకు తెలియకుండా సింగరేణి యాజమాన్యంతో కుమ్మక్కై పేషీట్ ద్వారా ఏఐటీయూసీ యూనియన్ ప్రతి కార్మికుడి నుంచి 500రూపాయలు రికవరీ చేయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వాస్తవానికి 1835కోడ్ దేవాలయానికి సంబంధించిదని, 1875కోడ్‌యూనియన్ సభ్యత్వానికి చెందిందన్నారు. ఈఅవకాశాన్ని చట్టం కల్పించిందన్నారు. కార్మికులను నేరుగా చందా అడిగే దమ్ములేక దొడ్డిదారిన టెంపుల్ పేరుతో డబ్బులు వసూలు చేసుకోవడం సరికాదన్నారు. రికవరీ చేసిన డబ్బులను తిరిగి కార్మికుల ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల అనుమతి లేకుండా ?

కార్మికుల అనుమతి లేకుండా వారివేతనాల నుంచి గుడిపేరిట ఏఐటీయూసీ యూనియన్ 500రూపాయల చొప్పున చందారికవరీ చేయించడం సరికాదని సింగరేణికాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ప్రధానకార్యదర్శి మందా నర్సింహారావు ఒక ప్రకటనలో అన్నారు. యూనియన్ సభ్యత్వం కోడ్(1875)పై రికవరీ చేయాల్సి ఉండగా, టెంపుల్ కమిటీ కోడ్(1835)పై చందా తీసుకోవడం ఏ మేరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ తప్పుకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహిస్తూ ఆ డబ్బును తిరిగి కార్మికులఖాతాల్లోకి తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న మైనింగ్‌స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ సబ్‌కమిటీ బెల్లంపల్లి రీజియన్ ప్రధానకార్యదర్శి వంగరి రాజేశ్వర్ రావు కోరారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉత్పత్తి, ఉత్పాద కత, రక్షణలో మైనింగ్ సిబ్బంది ముందుంటారన్నారు. సింగరేణిలో ఐఈడీ నిబంధనల ప్రకారం అండర్‌మేనేజర్ పోస్టులు100 ఉండగా, 20మాత్రమే ప్రకటించారని, మిగిలిన వాటిని నోటిఫికేషన్‌లో పొందుపర్చాలన్నారు. ఓవర్‌మెన్, మైనింగ్ సర్దార్, షాట్‌ఫైరర్‌ల చార్జీ అలవెన్స్ పెంచాలన్నారు. ఏ గ్రేడ్‌లో ఉన్న మైనింగ్ స్టాఫ్‌కు బంగ్లా కీపప్ అలవెన్స్ ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. లేనిపక్షంలో సింగరేణివ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, శ్రీరాంపూర్ బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆశిష్, నాయకులు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డు పరిమితి పెంచాలి

మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు సీపీఆర్ఎంఎస్ హెల్త్‌కార్డులకు రూ.20లక్షల పరిమితిని పెంచాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ రూ.45వేలు చెల్లిస్తే రూ.8లక్షలతో కూడిన కార్డును యాజమాన్యం అందజేసిందని, క్యాన్సర్, ఇతర భయంకర మైన వ్యాధులు వచ్చినప్పుడు ఈనిధులు సరిపోవడం లేదన్నారు. ఈకార్డుతో కార్పోరేట్ ఆసుపత్రు లకు వెళితే రెండుమూడు రోజులకే రూ.8లక్షలు అయిపోతున్నాయన్నారు. వెంటనే కార్డుపరిమితిని రూ.20లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కార్డును మీసేవలో ఉద్యోగవిరమణ కార్మికులు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

అండాళమ్మ కాలనీలో

అక్రమ నిర్మాణాలు..

5వపేజీ తరువాయి..

నాయకుల ముసుగులో అక్రమ విక్రయాలు...

అండాళమ్మ కాలనీలో చోటామోటా నాయకులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. తమ ఆధీ నంలో ఉన్న ఒక్కో ప్లాట్‌కు రూ. లక్ష చొప్పున వసూలు చేస్తూ ఇతరులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అలా అక్రమ మార్గంలో ప్లాట్లు పొందుతున్న స్థానికులు కొందరు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం అదును చూసి తమ ఇళ్లను ఆనుకొని ఉన్న మిగతా ఖాళీ స్థలాలను కబ్జా చేసుకుంటున్నారు. అలా కబ్జా చేసిన స్థలంలో మేకల పెంపకం పేరుతో గుడిసెలు ఏర్పాటు చేస్తూ చేజిక్కించుకుంటున్నారు. కాలనీలో సుమారు వంద నుంచి రెండు వందల ప్లాట్ల వరకు అన్యాక్రాంతం అయినట్లు ప్రచారం జరుగుతోంది. కాలనీలో చదరపు గజం బహిరంగ మార్కెట్ ప్రకారం విలువ కనీసం రూ. 10వేలు పలుకుతోంది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి అండాళమ్మ కాలనీలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

చెరువును పరిశీలించిన అధికారులు



చెరువు తూమును పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

హాజీపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొనబండ చెరువును ఆదివారం నీటిపారుదల శాఖ ఈఈ రాము, డీఈఈ కుమార్, ఏఈఈ ప్రణీత్‌లు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చెరువును పరిశీలించామని, త్వరలోనే తూముకు సంబంధించి, చెరువు కట్టకు సంబంధించిన పనులను అంచనా తయారు చేసి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెమినార్ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బెల్లంపల్లిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో ఈనెల 7న నిర్వహించే ఎంసీపీఐయూ జాతీయ సెమినార్ పోస్టర్లను ఆదివారం పట్టణంలోని కాంటా చౌరస్తాలో పార్టీ నాయకులు విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు మాట్లాడుతూ రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ఫాసిస్టు తదితర అంశాలపై సెమినార్ ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లక్ష్మణ్, నారాయణ, మల్లయ్య, రాజారాం, అన్వేష్, వసంతరావు పాల్గొన్నారు.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని అఖిల భారత మహిళా సమాఖ్య జిల్లా నాయకులు దుర్గం లక్ష్మి, కామెర పద్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సెమినార్ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు దుర్గం మొండి, ఇస్తారి, బానయ్య తదితరులు పాల్గొన్నారు.



పారుపెల్లి గుట్టల్లో వెలిసిన భైరవస్వామి



చుట్టూ అటవీ ప్రాంతంలో ఉన్న భైరవ దేవాలయం

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం...

భైరవ కొండ...

- స్వయంభుగా వెలిసిన కాలభైరవుడు
- ప్రతీ ఆదివారం భక్తుల రద్దీ



పూజలు చేస్తున్న భక్తులు

కోటపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం... కొండలు.. గుట్టల కింద నీటిధారలు... పక్కనే గోదారమ్మ గలగలలు... పచ్చని పొలాలు... పక్షుల కిలకిలలు వెరసి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది భైరవకొండ. కొండపై తపస్సు చేసుకుంటున్న రుషులు, మునీశ్వరుల యాగశాలలను గోదావరి నది తన ప్రవాహంతో ముంచెత్తుతుండడంతో శివాజ్ఞతో నది ప్రవాహానికి అడ్డుగా నిలిచి నది దిశనే భైరవుడు మార్చాడని స్థల పురాణం చెబుతోంది. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాల భైరవునిపై ప్రత్యేక కథనం...

కోటపల్లి మండలంలోని పారుపెల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండపై కాల భైరవుడు స్వయంభుగా వెలిశాడు. నాసిక్ సమీపంలోని త్రయంబకేశ్వరం వద్ద జన్మించిన గోదావరి ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్వేది వద్ద సముద్రంలో కలిసే వరకు తూర్పువైపునకే ప్రవహిస్తుంది. చెన్నూరు మండలంలోని పొక్కూరు వద్ద నుంచి పారుపెల్లి భైరవకొండ మూల మలుపు వరకు గోదావరి నది ఉత్తర దిక్కులో ప్రవహిస్తుంది. ఉత్తర దిక్కుగా ప్రవహించడం వల్ల ఈ ప్రాంతంలో గోదావరి నదిని పంచ క్రోశ ఉత్తర వాహినిగా పిలుస్తారు. ఉత్తర వాహినిలో స్నానమాచరించడం పుణ్యమని పండితులు చెబుతారు.

● భైరవునికి నిత్య పూజలు

పారుపెల్లి గుట్టల్లో వెలిసిన భైరవునికి నిత్య పూజలు జరుగుతున్నాయి. చెన్నూరుకు చెందిన మార్వాడీలు షెడ్డు ఏర్పాటు చేశారు. ప్రతీ ఆదివారం చెన్నూరుతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు, ఇతర పట్టణాల నుంచి భక్తులు తరలివస్తారు. కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అయితే ప్రభుత్వం ఆలయాన్ని అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటక ప్రాంతంగా గుర్తిస్తే మరింత ప్రయోజనం కలుగుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ యేటా భైరవాష్టమి రోజు ఉత్సవం నిర్వహిస్తారు. హోమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా వేలాది మంది భైరవున్ని దర్శించుకుంటారు.

● గోదావరి దిశను మార్చిన భైరవుడు

ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న గోదావరి నది ప్రవాహాన్ని తూర్పు దిశ వైపు భైరవుడు మళ్ళించాడని స్థల పురాణం చెబుతోంది. ఉత్తరంగా ప్రవహిస్తే పారుపెల్లి గుట్టలపైన యజ్ఞ యాగాదులు చేస్తున్న మునీశ్వరులకు, ఋషులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో శివుడి ఆజ్ఞ మేరకు భైరవుడు దిగంబరుడిగా నది ప్రవాహానికి అడ్డుగా నిలిచాడని, దీంతో గోదారమ్మ తన ప్రవాహ దిశను తూర్పు వైపు మళ్ళించిందని చెబుతారు.

● శివాంశ సంభూతుడు...

భైరవుడు శివాంశ సంభూతుడని పంచ భూతాలు, సూర్యచంద్రాది గ్రహాలు భైరవుని అదుపాజ్ఞలలో ఉంటాయని పండితులు అంటారు. కాలాన్ని శాసించినందున కాలభైరవుడు అనే పేరు వచ్చిందని శివ పురాణం చెబుతోంది. భైరవుడు ఇక్కడ కొలువై ఉండడంతో ఈ ప్రాంతాన్ని పవిత్రంగా భావిస్తారు భక్తులు. పారుపెల్లి గ్రామస్థులు తమ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మొదటి మొక్కు భైరవునికే చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది.

శబరిమలలో భక్తుల సౌకర్యాలకు కృషి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏబీఏపీ నాయకులు

గర్మిళ్ల/శ్రీరాంపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శబరిమలలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు మేల్ శాంతి (పూజారి) సమాజం, అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ కృషి చేస్తుందని జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు, ఏపీ తెలంగాణ కోఆర్డినేటర్ రాచర్ల రమేష్‌లు పేర్కొన్నారు. ఈనెల 14న కేరళలో నారాయణ తోడ్‌లో ఏబీఏపీ ఆధ్వర్యంలో నిర్మించిన అన్నదాన మందిరాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలో ఏబీఏపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. డిసెంబరు 3న అయ్యప్ప స్వాముల సామూహిక పడిపూజ, కోటి పుష్పార్చన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అన్నదాన మందిరం బ్రోచర్ విడుదల చేశారు. అయ్యప్ప ధర్మతత్వాన్ని ప్రచారం చేసి ప్రజల్లో అయ్యప్ప భక్తుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా భాయిదూజ్ వేడుకలు

మందమర్రిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాళీనగర్‌లో ఆదివారం బెంగాలీ మహిళలు భాయిదూజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోదరులు సుఖ సంతోషాలతో ఉండాలని సోదరీమణులు అక్షింతలు వేసి, బొట్టు పెట్టి ఆశీర్వదించారు. తమలపాకులతో చెంపలపై రాస్తూ జీవితాంతం ఆనందంగా ఉండాలని ఆశీస్సులు అందించారు. బెంగాలీ మహిళలు , స్థానికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరుకు మోటారు బిగిస్తున్న స్థానికులు

కోటపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శెట్‌పల్లి గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సూరం సందీప్‌రెడ్డి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌కు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో రెండు వాడల్లోని తాగునీటి బోర్లకు మోటార్లు చెడిపోవడంతో స్పందించిన అధికారులు కొత్త మోటార్లు అందించారు. ఆదివారం కొత్త మోటార్లను బిగించడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యేకు నాయకులు సందీప్‌రెడ్డి, పోశం, రాజేష్, మాజీ సర్పంచు రాంరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

గూడెం ఆలయంలో భక్తుల రద్దీ



గూడెం ప్రధానాలయంలో స్వామి వ్రతాలు

దండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం సెలవు రోజు కావడంతో గూడెం సత్యనారాయణ స్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 25వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్తీక ఉత్సవాల్లో భాగంగా దేవాలయంలోని అగ్నిప్రతిష్ఠ, హవనము బలిహరణము, తీర్ధ ప్రసాద వితరణ కార్యక్రమాలను యజ్ఞనచార్యులు అభిరాముచార్యులు ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబసభ్యులు గోవర్ధన రఘస్వామి, సంపత్‌స్వామి, అర్చకుల ఆధ్వర్యంలో వేద మంతోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. సమీప గోదావరి నదిలో స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవున్ని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోని రావి చెట్టు, ప్రధానాలయం ఎదుట ధ్వజస్తంభం వద్ద ఉసిరి కాయలతో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, లక్సెట్టిపేట సీఐ కరీముల్లాఖాన్, ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సమగ్ర కులగణనకు సమాయత్తం

- 60రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు
- ఎన్యూమరేటర్ల నియామకానికి కసరత్తు
- 75ప్రశ్నలతో సర్వే పత్రం
- 6నుంచి సర్వే షురూ





కులగణనకు స్టిక్కర్లను అంటిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కాగజ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన సర్వే సన్నాహాలు మొదలయ్యాయి. ఈనెల 6నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతో జిల్లా అధికార యంత్రాంగం ఆ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువు 60రోజుల్లో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కులగణన పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోనున్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతరవర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వీటితోపాటు సామాజిక స్థితిగతులు, ఆర్థికపరిస్థితి తదితర అంశాలపై అంచనా వచ్చేందుకు ప్రభుత్వం ఆ దిశగా కసరత్తు చేస్తోంది. బీసీల్లో మొత్తం 126 కులాలుండగా, వీరిలో పద్మశాలి, మున్నూరు కాపు, యాదవ, గౌడ్లు, విశ్వబ్రాహ్మణ, రజక, బెస్త, గంగపుత్ర, నాయిబ్రాహ్మణ, వడ్డెర, పెరిక, కుమ్మరి, వడ్రంగి, కూనపులి, తదితర కులాలు వారు జిల్లాలో ఉన్నారు. వీరితోపాటు సంచార జాతులు వారు కూడా ఉన్నారు. ఇంటింటా సర్వే చేసేందుకు ఎన్యూమరేటర్లను నియమించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయాశాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు.

ఈ సర్వేకు ఎంతమంది ఎన్యూమరేటర్లు అవసరం అవుతారు..? ఎన్ని బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది..? ఏఏ ప్రభుత్వ శాఖల నుంచి ఎన్యూమరేటర్లను సేకరించాలి..? అనే అంశాలపై అధికారులు ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 1500మంది జనాభాకు ఒకబృందాన్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. కాగా బీసీల లెక్కింపు తెలంగాణ రాష్ట్రంలో ఇదే మొదటిసారి కావటంతో అందరి దృష్టి వీరిపైనే పడింది. ప్రతి పదేళ్లకొకసారి నిర్వహించే జనాబా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కులగణన మాత్రం చేపట్టలేదు. దీంతో బీసీలు ఎంతమంది ఉన్నారు అన్న ఖచ్చితమైన లెక్కలు లేవు. దీంతో బీసీలు ఖచ్చితంగా ఎంతమంది ఉన్నారనేది ఇంత వరకు స్పష్టత రాలేదు. ఇది బీసీవర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. దీనిపై బీసీ సంఘాల నేతల పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయస్థానం సైతం బీసీ జనాభా తేల్చాని ప్రభుత్వాన్ని ఆదేశించటంతో రాష్ట్రప్రభుత్వం కులగణనకు సన్నద్ధమైంది. 75ప్రశ్నలుండగా, పార్టు1లో యాజమాని కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించి 58 ప్రశ్నలు. పార్టు2లో కుటుంబ వివరాలు సంబంధించిన 17న ప్రశ్నలను ఈ సర్వేలో పొందుపర్చారు. ఈ సర్వే పూర్తిగా జరిగితే బీసీ జనాభా శాతం ఎంత ఉంది అనేది తెలుస్తుంది. దీంతో రానున్న సర్పంచి ఎన్నికలకు ఈ లెక్కలు బీసీలకు ప్రామాణికం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

నేడు వీటీ అబ్రహం వర్ధంతి



మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల వేగు చుక్క దివంగత ఏఐటీయూసీ నాయకులు వీటీ అబ్రహం వర్ధంతి సోమవారం జరగనుంది. ఏఐటీయూసీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్కెట్ సెంటర్‌లోని అబ్రహం స్తూపం వద్ద కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ర్యాలీ చేపట్టనున్నారు. ఆదివారం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కార్యదర్శి భీమనాధుని సుదర్శన్‌లు మాట్లాడుతూ వర్ధంతికి కార్మికులు తరలి రావాలని కోరారు.

ఎర్రవాగుపై తాత్కాలిక వంతెన నిర్మాణం

భీమిని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి, చిన్న తిమ్మాపూర్ గ్రామాల మధ్యలోని ఎర్రవాగుపై ఆదివారం తాత్కాలిక వంతెన నిర్మించారు. పైపులు వేసి మొరం, మట్టి పోసి వాహనాలకు దారి ఏర్పాటు చేశారు. గతంలో వాహనాలు వాగు దాటేందుకు ఇబ్బంది అయ్యేదని, వంతెన నిర్మాణంతో ఆ బాధలు తప్పాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇందూరి భూమయ్య, కిషన్, శంకర్, కోట మల్లేష్, సోమిషెట్టి రాజేందర్, విగ్నేష్, రాకేష్, దేవాజీ, మధూకర్, మల్లేష్ ఆర్థిక సాయం అందజేశారు.

ఆకట్టుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



సమ్మేళనంలో శ్రీవిష్ణు శివానికేతన్ పూర్వ విద్యార్థులు

తాండూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సురభి గోదా క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులు లక్ష్మణ్‌రావు, రామ్మోహన్‌రావు, గట్టు గణపతిశర్మ, కొండయ్య, సూర్య ప్రకాష్, లచ్చిరెడ్డి, సురేందర్, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదే పాఠశాలలో చదివిన 1990-91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సురభి గోదా క్షేత్రంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని గురువులను ఘనంగా సన్మానించారు.

శ్రీవిష్ణు శివానికేతన్ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సురభి ఫంక్షన్‌హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనలంలో 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ప్రమాదాలకు నిలయంగా ఆర్వోబీ

- ఆర్వోబీపై అలుముకున్న అంధకారం
- మూలమలుపు వద్ద బోర్డులు లేక తంటాలు


కాగజ్‌నగర్ ఆర్వోబీ

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-ఈసుగాం వెళ్లే మార్గంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద తరుచూప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు మాత్రం ఇంతవరకు తేరుకోవటం లేదు. ప్రమాదాలు జరుగకుండా ఈమార్గంగుండా ఉన్న మూలమలుపుల వద్ద కనీసం బోర్డులు కూడా ఏర్పాటు చేయటం లేదు. రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వీధిదీపాలు వెలుగకపోవటం కూడా మరో సమస్యగా ఉంది. నిత్యం ఈసుగాం-కాగజ్‌నగర్ మధ్య వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పెంచికల్‌పేట, బెజ్జూరు, మహారాష్ట్ర వెళ్లే మార్గం కూడా ఇదే కావటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. కాగా రెండేళ్లలో ఇప్పటివరకు పది రోడ్డు ప్రమాదాలు ఈ రహదారిపై చోటు చేసుకున్నాయి. ఈప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ట్రాఫిక్‌ఉండడం, అతివేగంగా ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఈ ప్రాంతాన్ని కనీసం యాక్సిడెంట్ జోన్‌గా కూడా గుర్తించటం లేదు. ప్రాణాలు పోతున్నా అధికారులకు పట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ దారిపై ప్రమాదాలు నివారించాలంటే కనీసం ఆర్వోబీ ముందు, చివరి భాగంలో రెండు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


సీసీకెమెరాలో రికార్డు అయిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. రెండ్రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం కూడా కేవలం అతివేగం, అంధకారంతోనే జరిగినట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. కాగజ్‌నగర్ మండలం బోడెపల్లికి చెందిన ఎగ్గె మాధవ్(24) చింతగూడలో ఉన్న అతని బావతో కలిసి ఇంటికి వెళ్లుతున్న క్రమంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా వచ్చిన వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మాధవ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అధికారులు ముందే స్పందించి ఉంటే తమ కొడుకు బతికే వాడని కుటుంబ సభ్యులు వాపోయారు. అలాగే ఈ బ్రిడ్జికి కొంతదూరంలో భట్టుపల్లి, ఈసుగాం చౌరస్తాలు ఉన్నాయి. రెండూ కూడా ప్రమాదకరంగా మూలమలుపుల్లో ఉన్నాయి. అతివేగం, వాహనాల రద్దీ ఈప్రాంతంలో ప్రమాదాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..

-లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్



ఆర్వోబీ వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంతవరకు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రమాదాలు జరిగి ప్రాణాలుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఆర్వోబీకి మొదట, చివరి భాగంలో స్పీడ్‌బ్రేకర్లు నిర్మిస్తే కొంత మేలు జరుగుతుంది. అలాగే మితిమీరిన వేగంతో వచ్చే వాహనాల వారికి అపరాద రుసుము విధించాలి. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి.

విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే


విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమ పాఠశాలలో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై మంచిర్యాలలోని మ్యాక్సీకేర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరలోనే కోలుకునేలా చికిత్సఅందించాలని వారికు సూచించారు. ఎమ్మెల్యే వెంట మంచిర్యాల జిల్లా డీడీ గంగారాం, హెచ్ఎంలు శ్రీనివాస్, లక్ష్మణ్ ఉన్నారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు: డీఎం


డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని విహారయాత్రలు, వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీబస్సులు అద్దెకు నడుపనున్నట్లు డిపోమేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం డిపో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేటువాహనాల్లో ప్రయాణం సురక్షితంకాదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఎంతోఅనుభవం కలిగిన డ్రైవర్లు ఉంటారన్నారు. ప్రజలను గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తున్నారన్నారు. సంస్థ నిర్ణయించిన ధరలకు అనుగుణంగా బస్సులను అద్దెకు ఇస్తామన్నారు. డిపోపరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 9959226006, 9441596246, 9440464035 నంబర్లను సంప్ర దించాలన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

ఆసిఫాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సేవాసంఘం పట్టణకార్యవర్గ ప్రమాణస్వీకారమహోత్సవాన్ని జయ ప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు అనుమండ్ల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయం వద్ద సంఘ నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల6న జిల్లాకేంద్రంలోని పద్మశాలిసేవాసంఘం భవనంలో నూతనకమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమానికి పట్టణంలోని పద్మశాలి కులస్తులందరు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవఅధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సంఘ సభ్యులు సంజీవ్, సురేష్, ప్రకాష్, మధుకర్, రమేష్, తిరుపతి, శ్రీనివాస్, ప్రణయ్ పాల్గొన్నారు.

ఖాతీగూడలో ముగిసిన దండారీ ఉత్సవాలు


దండారీ దేవతలకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

సిర్పూర్(యు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాతీగూడలో ఆదివారం దండారీ ఉత్సవాల ముగింపు (కొలబొడి) కార్యక్రమం నిర్వహించారు. దండారి ఎత్మసార్‌దేవతల ఉత్సవాలు దీపావళి పండుగకు ముందు భోగి కార్యక్రమంతో ప్రారంభించారు. దండారీ వేడుకలు వారం రోజులుగా ఆదివాసీ గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. వారం రోజులపాటు ఆదివాసీ గ్రామాల్లో పండుగ వాతవారణం నెలకొంది. మండలంలోని ఆయాగ్రామాల్లో దండారీ ముగింపు (కొలబొడి) కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలు తమ దండారీ దైవానికి ప్రత్యేకపూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అందరు సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో సేడ్మకి గణపత్‌రావు పటేల్, ఆత్రంనేహ్రూ పటేల్,ఆత్రం రాము, ఆత్రం జ్యోతిరాం, ఉయక గుణవంత్‌రావు, ఆత్రం జంగు, ఆత్రం లింబారావు, ఆత్రం బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మడావి ఆనందర్‌రావ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మడావి ఆనంద్‌రావ్‌ను సన్మానిస్తున్న పోలీసులు

జైనూర్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): చిత్రకళా ప్రదర్శనలో మండలంలోని రాసిమెట్టకు చెందిన మడావి ఆనందర్‌రావ్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ రాణించాలని జైనూర్ సీఐ రమేష్ కోరారు. సీఐ కార్యాలయంలో ఆదివారం చిత్రకళా కారుడు ఆనంద్‌రావును జైనూర్ పోలీసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ మడావి ఆనంద్‌రావ్ తన విశిష్ఠమైన కళాత్మకతతో దేశ వ్యాప్తం గా గుర్తింపు పొందడం, రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, ఎస్ఐ ఉద్దవ్, పోలీసులు, ఆదివాసీ ఆర్టిస్ట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ

చింతలమానేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘం కమిటీని ఆదివారం కర్జవెల్లి మోడ్రన్ రైస్‌మిల్లులో ఎన్నుకున్నారు. గౌరవఅధ్యక్షుడిగా మిర్యాల కాశయ్య, బండ నందకుమార్, నూకల వెంకటేశ్వర్లు, బోనగిరి శ్రీకాంత్, కొలిపాక మధుకర్, మండలా ధ్యక్షుడిగా నూకల మొండయ్య, ప్రధానకార్యదర్శిగా బండ ప్రకాష్, కోశాధికారిగా ఎలుక సుదర్శన్, ప్రచారకార్యదర్శిగా రేణికుంట్ల శ్యాం కుమార్, ఉపాధ్యక్షులుగా బండ రమేష్, యువజన సంగం సభ్యులుగా నూకల శ్రీధర్, బోనగిరి వంశీ, కోటసాయికృష్ణ, మహిళా కమిటీ అధ్యక్షు రాలిగా పార్వతల కవిత, ప్రధాన కార్యదర్శిగా బండ సుమలత, ప్రచార కార్యదర్శిగా జిల్‌పెల్లి అపర్ణను ఎన్నుకున్నారు.

నేడు ఎమ్మెల్యే హరీష్‌బాబు దీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) అటవీశాఖకార్యాలయం ఎదుట సోమవారం నిరాహర దీక్షచేస్తున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారంరోజుల క్రితం మండలంలోని బెంగాళీ క్యాంపునకు చెందిన ఏడుగురిపై అక్రమంగా కేసుపెట్టి చితకబాధిన అటవీశాఖ అధికారుల తీరును నిరసిస్తూ నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. గతంలోసైతం అటవీశాఖ అధికారులు వన్యప్రాణు లను చంపారన్న నెపంతో లక్షలు వసూలు చేసి కాగజ్‌నగర్ డీఎఫ్‌వోకు కట్టబెట్టారని ఆరోపించారు. అలాగే కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీశాఖకు మంజూరైన కంపా నిధులలో అటవీ అధికారులు లక్షలరూపాయల అవినీతికి పాల్పడ్డారని అవికూడా బహిర్గతం చేయాలన్నారు. అటవీశాఖ అధికారులపై రాష్ట్ర మంత్రి, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలుపెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయనవెంట నాయకులు శంకర్, సత్యనారాయణ, అశోక్, నాని, సాయిప్రశాంత్, వానుపటేల్, జావీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్: సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్‌లను ఆదివారం ఎమ్మెల్యేహరీష్‌బాబు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థికసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం సహాయనిధికి అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలోలబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా బులాయి వేడుకలు

ఆసిఫాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దీపావళిపర్వదినాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ మండలం రాజురాగ్రామంలో ఆదివారం బులాయివేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. దీపావళి పండుగరోజు ప్రారంభమైన ఈ వేడుకలు మూడురోజులపాటు కొనసాగాయి. మొదటిరోజు సంప్రదాయంగా మట్టిని తెచ్చి బులాయి మట్టి ప్రతిమలను తయారుచేసి ప్రత్యేక పూజలు చేశారు. శనివారంరాత్రి ప్రతిమలను బతుకమ్మలవలే మధ్యలోపెట్టి యువతులు, మహిళలు బులాయి ఆడారు. ఆదివారం ఉదయంగ్రామంలోని పెద్ద వాగులో బులాయి ప్రతిమలను నిమజ్జనం చేశారు.


రాజురాలో బులాయి ఆడుతున్న మహిళలు

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న వంటమనిషి, సహాయవంట మనిషి, నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పోస్టులను 10వతరగతి మార్కుల మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఎంపిక కార్యక్రమం కమిటీ సభ్యుల సమక్షంలో జరుగుతుందన్నారు. ఈనెల 10లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సాయుధ విప్లవం ద్వారానే మార్పు వచ్చింది

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత కె విశ్వనాథ్


వారోత్సవాల్లో పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సాయుధ విప్లవం ద్వారా వ్యవస్థలో మార్పు వచ్చిందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత కె విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ అమరవీరుల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విప్లవ ఉద్యమంలో భూమి, భుక్తికోసం పేద ప్రజల విముక్తికోసం తమ నిండు ప్రాణాలను అర్పించిన మహానీయులు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీలో ఎంతోమంది ఉన్నట్టు తెలిపారు. వారిని స్మరించుకోవటం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏఐకెఎంఎస్ఎల్ భీమన్న, బి కాంతయ్య, లక్ష్మీనారాయణ, ఎండీ ఖాజాబాయ్, ఖాజామైనోద్దీన్, వేల్పుల రాజమల్లు, పి విలాస్, ఎల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

రెబ్బెన, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్, రాళ్లపేట గ్రామాల్లో డీవైఎఫ్ఐ సంఘం ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనం తరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, కార్యదర్శి ఆత్మకూరు సతీష్ మాట్లాడుతూ డీవైఎఫ్ఐ సంఘం సమాజంలో నెలకొన్న సమస్యలపై పోరాడుతుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం పేరుతో యువతను మత్తులో ముంచుతోందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు పర్చటం లేదన్నారు. అలాగే రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఇంతవరకు భర్తీ చేయటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, ఉపాధ్యక్షులు చల్లూరి కృష్ణ, మండల నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

రెబ్బెన, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్‌లో వెలసిన కనకదుర్గాదేవి మహంకాళి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిబియ్యం, నైవేద్యాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యోగాలో రాణిస్తున్న అలేఖ్య

- జాతీయస్థాయిలో పతకాలు

రెబ్బెన, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన కేసరిఅంజనేయులుగౌడ్ కుమార్తె అలేఖ్య యోగాలో అరుదైన ప్రతిభకనబరుస్తోంది. యోగాప్రదర్శనలిస్తూ రాష్ట్ర జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది.

యోగా వైపు అడుగులు..

అలేఖ్య ఇంటర్‌చదువుతున్న రోజుల్లో అనారోగ్యానికి గురయింది. బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిబిరంలో యోగా నేర్చుకుంటున్న తండ్రి అంజనేయులుగౌడ్ ఈవిషయం తెలుసుకొని కుమార్తెను యోగా వైపు ఆసక్తి కలిగించేలా చర్యలు తీసుకున్నారు. గోలేటిలోని సీఈ ఆర్ క్లబ్‌లో ఉచితంగా నేర్పిస్తున్న యోగా శిక్షణలో చేర్పించారు. కఠోర సాధన చేస్తూ అలేఖ్య చక్కటి ఆసనాలు వేయటం ప్రారంభించారు.

యోగా పోటీల్లో..

2018లో కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం లభించింది.

2018 విజయవాడలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రానికి పతకం తీసుకొచ్చారు.


యోగా ఆసనాలు వేస్తున్న అలేఖ్య

2019లో నాగ్‌పూర్, 2020బెంగుళూరులో జరిగిన పోటీలో నోబుల్ వరల్డ్ రికార్డులో పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో ఛత్తీస్‌గడ్‌లో జరిగిన జాతీయస్థాయి ఆల్ ఇండయా పోలీసు గేమ్స్‌లో రెఫరీగా వ్యవహరించారు.

విద్యాభ్యాసం..

అలేఖ్య రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి ఉన్నతపాఠశాలలో చదువు పూర్తిచేశారు. ఇంటర్, డిగ్రీ హన్మకొండలో పూర్తి చేశారు. ఎన్ఐఎస్ యోగా కోర్సు పూర్తిచేశారు. తమిళనాడులో మీనాక్షి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కూడా పూర్తి చేశారు. ఏరియల్, ప్రెగ్నెన్సి, కిడ్స్ యోగాలో ఒక్కొక్క దాంట్లో ప్రత్యేక తీసుకున్నారు. అలాగే 2023లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు కూడా పూర్తిచేశారు. అలాగే రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలు సాధించారు. ప్రస్తుతం జాతీయస్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు.

ప్రతి ఒక్కరు యోగా నేర్చుకోవాలి..-అలేఖ్య, గోలేటి



ప్రతిఒక్కరూ యోగా నేర్చుకోవాలి. యోగాతోనే సంపూర్ణమైన ఆరోగ్యం వస్తుంది. నేను నా కుటుంబ సభ్యుల సహకారంతోనే ఈ స్థాయికి వచ్చాను. ప్రస్తుతం దేశ, వీదేశాల్లో ఉండే వారికి ఆన్‌లైన్ క్లాసులు నేర్పిస్తున్నాను. అంతర్జాయస్థాయి యోగా శిక్షకురాలిగా రాణించాలన్నదే నా లక్ష్యం.

ఎంత అందంగా ఉన్నానో..

కెరమెరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎంత అందంగా ఉన్నానో నేను.. అనుకుంటూ మురిసిపోతోంది ఈ పిచ్చుక. ఒకప్పుడు పొద్దున లేవగానే కిచ్‌కిచ్ అంటూ చప్పుడు చేస్తూ సందడి చేసే పిచ్చుకలు పెరిగిన పర్యావరణ కాలుష్యం దృష్ట్యా కనుమరుగై పోతున్నాయి. ప్రస్తుతం చాలా తక్కువ సంఖ్యలో అవి కనిపిస్తున్నాయి. అలాంటి ఓ పిచ్చుక గాల్లో వెళ్తూ వెళ్తూ ఓబైక్‌కు ఉన్న అద్దంను చూసి దానిముందు వాలి హోయ లొలికించింది. మళ్లీమళ్లీ తనను తానూ చూసుకుంటూ సంబురపడిపోయింది. కెరమెరి మండల కేంద్రంలోని ఓ బైక్ వద్ద పిచ్చుక చేసిన ఈ సందడిని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.


అద్దంలో తనను తాను చూసుకుంటున్న పిచ్చుక